8న సామూహిక 'భగవద్గీత పారాయణం'

నల్లకుంట: సనాత ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈనెల 8న సామూహిక భగవద్గీత పారాయణం కార్యక్రమం ఉంటుందని సమితి ప్రతినిధి వేముల వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందానగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని విశాఖ శారదా పీఠపాలితలో ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. 1116 మంది భక్తులతో సామూహిక పారాయణం ఉంటుందన్నారు. ఆసక్తి గలన వారు ఫోన్ నం.92465 08682లో సంప్రదించాలని కోరారు.

డిజిటల్ పాలన సేవలను బలోపేతం చేస్తాం


బాధ్యతలు స్వీకరిస్తున్న అశోక్‌కుమార్

చిక్కడపల్లి: ఇండియన్ పోస్ట్ టెలి కమ్యూనికేషన్స్ అంకౌంట్స్ అండ్ ఫైనాన్స్ ప్రిన్సిపాల్ కంట్రోలర్‌గా అశోక్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ అధికారి గతంలో ఫైనాన్స్, ప్రజావ్యయ నిర్వహణ, విధానాల అమలులో కీలకపాత్ర పోషించారు. చిక్కడపల్లిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ పాలన సేవలను బలోపేతం చేస్తానన్నారు.

ప్రేక్షకరంజకంగా స్వామి అయ్యప్ప నాటక ప్రదర్శన


కళాకారులతో లంకా లక్ష్మీనారాయణ

చిక్కడపల్లి: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో సోమవారం స్వామి అయ్యప్ప నాటక ప్రదర్శన ప్రేక్షక రంజకంగా సాగింది. కళాకారులు పాత్రోచితంగా ప్రదర్శనను రక్తికట్టించారు. 16వ నాటకోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, ఎంకే రాము, సాల్వాచారి, బాబురాజు, వెంగమాంబ, పరమేష్, రాజేశ్వర్, లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంకే రాముకు ఆత్మీయ సత్కారం



చిక్కడపల్లి: అందాశ్ కూచిపూడి నాట్యాలయ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సచ్చిదానంద కళాపీఠం అధ్యక్షుడు రత్నాకర శర్మ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనల కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం బాలబంధు ఎంకే రాముకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మల్యాద్రి, కాందాల హరిణి, వేణు, సంగీత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోండి

కాచిగూడ: హర్రాస్‌పెంట హిందూ శ్మశానవాటిక ట్రస్‌బోర్డు ఆధ్వర్యంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఫిజియోథెరపీ, క్లినిక్, కుట్టు శిక్షణ, మెహిందీ, బోటిక్, యోగా తదితర విభాగాల్లో అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్ కోరారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదల కోసం లక్షలు వెచ్చించి నిర్వహిస్తున్న క్లినిక్‌లో షుగర్, బీపీ, బ్లడ్ టెస్ట్ తదితర వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఉచితంగా మందులను సైతం అందజేస్తున్నట్లు తెలిపారు. మొదటి అంతస్తులో ఆధ్యాత్మిక పుస్తకాలతో కూడిన రీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ విగ్, సాయి గిరిధర్, సి.నందకిషోర్ యాదవ్, భీమగోని కృష్ణగౌడ్, సత్యనారాయణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని మహిళ (60) ఫలక్‌నుమా – ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గాభవానీనగర్ పార్కుకు సొబగులు

- మొన్నటి దాకా దుర్గంధం...
- సుందరీకరణకు నోచుకుంటున్న జీహెచ్‌ఎంసీ పార్కు
- జూబ్లీహిల్స్ నడిబొడ్డున నిర్లక్ష్యానికి గురైన పార్కు
- రూ. 75 లక్షలతో ఆకర్షణీయంగా మలుస్తున్న రోటరీ క్లబ్‌ఆఫ్ జూబ్లీహిల్స్

బంజారాహిల్స్: కాలనీవాసులు, పాదచారులకు, చిరు వ్యాపారులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన ఉద్యానవనాలు చాలాచోట్ల చెత్తాచెదారంతో పచ్చదనం కరువై ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. కొన్ని చోట్ల అయితే మురికి కుంటలు అక్కడికి వచ్చేవారికి ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తుండగా దోమలు, ఈగలు, దుర్గంధంతో పార్కులకు వెళ్లాలంటేనే నరకప్రాయంగా మారుతున్నది. పార్కులను పచ్చదనం పరిశుభ్రతతో తీర్చిదిద్దాల్సిన జీహెచ్‌ఎంసీ నిధుల లేమితో నీరుగారిపోతున్నది. ఫలితంగా చాలా పార్కులు ఆహ్లాదానికి దూరమై మురికి కూపాలుగా మారుతున్న నేపథ్యంలో మేమున్నామంటూ స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. అలాంటిదే జూబ్లీహిల్స్ రోడ్ నెం.5లోని వెంకటగిరి చౌరస్తాలో దుర్గా భవానీ నగర్ బస్తీని ఆనుకొని ఎకరన్నర విస్తీర్ణంలో విస్తరించిన జీహెచ్‌ఎంసీ పార్కు. ఈ పార్కులోకి బడా బాబులు నివసించే జూబ్లీహిల్స్ కాలనీకి చెందిన డ్రైనేజీ మురుగంతా చేరి చిన్నపాటి కుంటగా మారింది. దుర్గంధం, దుర్వాసనలతో ఇక్కడికి వచ్చేవారు ముక్కులు మూసుకొని కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రజాప్రతినిధులకు, అధికారులకు పట్టలేదు. ఈ పార్కును బాగు చేయాలనే ఆలోచన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చింది.


మురుగు బయటకు వెళ్లేందుకు నిర్మిస్తున్న పైప్‌లైన్

రూ. 75 లక్షల వ్యయంతో...

జూబ్లీహిల్స్ నడిబొడ్డును ఎకరన్నర విస్తీర్ణంలో జీహెచ్‌ఎంసీ పార్కులో డ్రైనేజీ మురుగు చేరి చిన్నపాటి కుంటగా మారడంతో ఈ పార్కును సుందరంగా తీర్చిదిద్దడానికి ముందుకొచ్చిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ స్వచ్ఛంద సంస్థకు అడుగడుగునా సవాళ్లు ఎదురవుతున్నాయి. పార్కును తీర్చిదిద్దాలంటే ఇక్కడ మురుగును, బురదను తొలగించడానికే రూ. 40 లక్షలు ఖర్చు చేస్తున్నారు. కొత్తగా డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి పార్కులోకి మురుగు చేరకుండా మురుగు నీటి కాల్వలోకి పైప్‌లైన్ మళ్లించారు. దీంతో మురుగు రావడం లేదు. అయితే ఇప్పటి వరకు మురుగు పేరుకుపోవడంతో వ్యర్థాలు, బురద, దుర్గంధం తొలగించే ప్రక్రియను ప్రస్తుతం ముమ్మరంగా చేపడుతున్నారు. ఇందుకోసం రూ. 10 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఇక వాక్‌వేతో పాటు లాన్ పూల మొక్కలు, ఇతర అలంకరణ మొక్కలు నాటేందుకు మరో రూ. 25 లక్షలు ఖర్చు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. మొత్తంగా ఈ పార్కు అభివృద్ధికి సంస్థ రూ.75 లక్షలు ఖర్చు చేస్తున్నది. ఇప్పటికే జీహెచ్‌ఎంసీతో ఎంవోయూ కూడా కుదుర్చుకుంది. మరో నెల రోజుల్లో ఈ పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ప్రక్రియ జోరుగా సాగుతుంది.

పచ్చదనం, పరిశుభ్రతే లక్ష్యం

జూబ్లీహిల్స్ నడిబొడ్డున విశాలమైన జీహెచ్‌ఎంసీ పార్కు దోమలు, ఈగలు, దుర్గంధం దుర్వాసనలతో స్థానికులకు ఏ మాత్రం ఆహ్లాదాన్ని ఇవ్వడం లేదు. స్థానికులు పలుమార్లు ఈ విషయాన్ని మా దృష్టికి తీసుకొచ్చారు. నిత్యం వందలాది మంది ఈ పార్కుకు వస్తుంటారు. కూర్చున్నంత సేపు ముక్కుమూసుకొని ఉండాల్సి వస్తున్నది. దీంతో పార్కును సుందరీకరించాలని మా కార్యవర్గం తలపెట్టింది. అనుకున్నట్లుగానే నిధులు కూడా సమకూరాయి. ఇటీవలే ఎంవోయూ పూర్తయింది. పచ్చదనం, పరిశుభ్రత నినాదంగా ఈ పార్కును తీర్చిదిద్దుతున్నాం. స్థానికులకు ఆనందాన్ని పంచేలా ఇక్కడ మొక్కలు నాటాలని నిర్ణయించాం. అరుదైన పూల మొక్కలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. కొద్ది రోజుల్లోనే స్థానికులకు అందుబాటులోకి వస్తుంది. ఆర్కిటెక్టర్లు డిజైన్లు కూడా రూపొందించగా ఈ ప్లాన్ ప్రకారమే ఇక్కడ పనులు జరుగుతున్నాయి.

– రొటేరియన్ బాలకోటి రెడ్డి, ప్రెసిడెంట్ రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్

టీబీని సకాలంలో గుర్తిస్తే నివారించవచ్చు


ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్: టీబీ వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం పొందితే నివారించవచ్చని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీ రోగులకు ఉచితంగా మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకం ద్వారా టీబీ రోగులకు పౌష్టికాహారం ఉచితంగా అందజేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రతన్‌లాల్‌నాయక్, పీహెచ్ఎన్ ఫెల్లీస్, ఏఎన్ఎంలు విజయకుమారి, సునిత, పద్మలత, సంతోషిణి, అనూషా, రజిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వైఎంసీఏలో ముగిసిన వేసవి శిక్షణ తరగతులు




కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నారాయణగూడ వైఎంసీఏ క్రీడా మైదానంలో చిన్నారులకు వివిధ అంశాల్లో 44వ వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులు సోమవారం వివిధ అంశాల్లో ప్రదర్శనలిచ్చారు. యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శోభన్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ జోనథన్ ధర్మరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ సందరాజ్, ప్రధానకార్యదర్శి ప్రిస్టీలీ గైస్, బీజే వినయ్‌స్వరూప్, కోచ్‌లు పాల్గొన్నారు.


అంబేడ్కర్ కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రొ. లింబాద్రి తదితరులు

అమరవీరులను స్మరించుకోవాలి: ప్రొ.లింబాద్రి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అంబేడ్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొ. లింబాద్రి అన్నారు. సోమవారం అంబేడ్కర్ కళాశాలలో తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రొఫెసర్ లింబాద్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం కాక చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వై.విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ మట్టా శేఖర్, విఠలాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ


ట్యాంక్‌బండ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న బాపూజీ విగ్రహానికి నివాళులర్పించి స్మరించుకున్నారు. స్వాతంత్ర్యంతో పాటు స్వరాష్ట్ర ఉద్యమ పోరాటంలో ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు.

రాష్ట్రం సాధించే వరకు పదవులు వదులుకున్న మహనీయుడు...

తెలంగాణ రాష్ట్రం సాధించే వరకు ఎలాంటి పదవులు తీసుకోనని ఉన్న పదవులను వదులుకున్న మహనీయుడని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి తన ఆస్తులను అప్పగించి మామూలు సాధారణ జీవితాన్ని గడిపారని గుర్తుచేశారు. ఇప్పటికీ భౌగోళిక తెలంగాణ మాత్రమే ఏర్పడిందని... సామాజిక తెలంగాణ ఇంకా రాలేదని రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో బీసీలు సామాజిక తెలంగాణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రియాజ్, కొండ లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు జ్ఞానేశ్వర్, గుజ్జ సత్యం, డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్, సి.రాజేందర్, కొండ దేవయ్య, ఆర్‌వీ.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ మోసాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇస్తామని చెప్పి కోట్ల రూపాయలు దండుకున్న ఎస్‌జీ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నేషన్ కన్జ్యూమర్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ తిక్కుంట్ల విశాల్, ప్రచార కమిటీ చైర్మన్ పొట్ట పింజర రమేష్ కోరారు. అడిక్‌మెట్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పని చేస్తున్న లక్ష్మీప్రసన్న ఆమె సన్నిహితులు ఎస్‌జీ ఎంటర్‌ప్రైజెస్‌ను ఏర్పాటు చేసి మోసం చేశారన్నారు. మన్సూరాబాద్‌కు చెందిన సుమన్, స్వాతి దంపతుల నుంచి దాదాపు రూ.50 లక్షలను డిపాజిట్ చేయించి మోసం చేశారని ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బాధితులు వనస్థలిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. వీరే కాకుండా అనేక మంది బాధితులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై నగర పోలీస్ కమిషనర్ స్పందించి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు.

రాష్ట్ర సాధనలో కవులు, కళాకారుల కృషి మరువలేనిది

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



చిక్కడపల్లి: కవులు, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తల కృషి ఫలితంగా ప్రత్యేక తెలంగాణ కళ సాకారమైందని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమవారం సాయంత్రం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధానామూర్తి అధ్యక్షతన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ... రాష్ట్ర సాధనలో కవులు, కళాకారులు, రచయితల కృషి మరువలేనిదని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుల త్యాగాలను ఎప్పుడూ స్మరించుకుంటూ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఎంవీ.రఘువీర్ ప్రతాప్ పాల్గొన్నారు.


బీజేపీ నగర కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి

జై తెలంగాణ

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబురాలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, బస్తీలు, కాలనీల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఉద్యమనేతల పోరాట పటిమ.. ఎందరో ఉద్యమకారుల బలిదానాలతో తెలంగాణను సాధించుకున్నామని అన్నారు. ప్రతి తెలంగాణ బిడ్డ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా ఉండాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు పని చేయాలన్నారు. పనిచేయని అధికారులు, ప్రజాప్రతినిధులతో పనిచేయించేలా గళమెత్తాలని తెలంగాణ ప్రజలు సూచించారు. ఈ సందర్భంగా ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించి వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు. అదే విధంగా ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మేధావుల చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు. ప్రతి గల్లీ.. ప్రతి వీధి 'జై తెలంగాణ.. జైజై తెలంగాణ'అనే నినాదంతో మార్మోగింది.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం


రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో జరిగిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి


పటేల్‌నగర్‌లో.. తెలంగాణ ఉద్యమకారులు సంక్షేమ సంఘం నేతలు


ప్రేమ్‌నగర్‌లోని హైమావతి పాఠశాలలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు


బతుకమ్మకుంటలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్


కార్మికశాఖ కార్యాలయంలో.. రాష్ట్ర అడిషనల్ కమిషనర్ గంగాధర్


కాచిగూడలోని ఓ ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న ప్రొ.రాంరెడ్డి, డా. ఏఆర్ రెడ్డి


ఫీవర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఇందిరాపార్కులో జెండాను ఆవిష్కరిస్తున్న మనోహర్ రెడ్డి


హౌస్‌ఫెడ్ కార్యాలయంలో... డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు


ఇందిరాపార్కు చౌరస్తాలో.. అంజన్‌కుమార్‌యాదవ్


రాంనగర్ చౌరస్తాలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి


రాంనగర్ చౌరస్తాలో జరిగిన అన్నదానంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్


గాంధీనగర్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, నాయకులు


అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో..